TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 10, గురువారం, సెప్టెంబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 126 తెలుగువారి పత్రిక..... మీ కోసం

యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

● బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు బండి సంజయ్

రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అన్న బండి సంజయ్ కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్యపోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం లేవన్న సంజయ్తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం,

గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం..

న్యాయం జరగకపోతే మానవ హక్కుల కమిషన్‌కు వెళ్తాం కేటీఆర్

రేవంత్ రెడ్డి సర్కారు ప్రతిపక్ష బీఆర్ఎస్ పట్ల వ్యవహరించిన తీరుపై తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తమకు ఇక్కడ న్యాయం జరగకపోతే ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్‌కు, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి 1000 రోజుల అసమర్థ పాలనపై తాము ప్రజల తరఫున ప్రశ్నిస్తే తమపై అరాచకానికి పాల్పడ్డారని విమర్శించారు. తాము ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారా తప్పు చేశామా..? అని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు గడిచినా అమలు చేయని హామీల గురించి ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పా..? అని కేటీఆర్ క్వశ్చన్ చేశారు. కాంగ్రెస్ అసమర్థతపై చర్చించేందుకు తాము అసెంబ్లీకి వెళ్లినప్పుడు, పోలీసులు తమను గేటు వద్ద అడ్డుకుని దాడి చేయడమే కాకుండా,ఒకవేళ ఇక్కడ న్యాయం జరగకపోతే, తాము ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్‌కు, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అదేవిధంగా కేసీఆర్ ఇంటిపై దాడి చేయడానికి వెళ్లిన కాంగ్రెస్ గుండాలకు పోలీసులు ఎర్ర తివాచీ పరిచినట్లుగా వ్యవహరించి, వారిని దగ్గరుండి తీసుకెళ్లిన ఘటనపై కూడా తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు.

తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

- ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్
- తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన
- మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి
- అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09(తెలంగాణ మంజీరా):

తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు.

స్టైఫండ్ డబుల్..

ఆయుష్ విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్

- స్టైఫండ్స్ భారీగా పెంచుతూ జీవో జారీ
- సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్.
- జీవో కాపి అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్ 09(తెలంగాణ మంజీరా):

ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు బుధవారం మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీఓ కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

మిగతా 2 లో

శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్

2

యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్‌రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపుసాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం

హైదరాబాద్,సెప్టెంబర్

కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం తెలిపారు.

మిగతా 2 లో

సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్ తమిళనాడులో కొత్త కూటమికి సన్నాహాలు?

● విజయ్ నాయకత్వంలో ఏర్పాటుకు సిద్ధం

చెన్నై, సెప్టెంబర్ 09(తెలంగాణ మంజీరా):

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసు కున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాం తాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబర్ 09(తెలంగాణ మంజీరా):

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన

మిగతా 2 లో

కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు
- ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం
- అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ

మిగతా 2 లో

కేసీఆర్‌పై అసెంబ్లీలో

మొదటిపేజీ తరువాయి

హైదారాబాద్, సెప్టెంబర్ 09(మన కర్తవ్యం):

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా? నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు.అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం.కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్‌ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

జడ్పీ పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకలు

మన కర్తవ్యం న్యూస్ ముస్తాబాద్/ సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో బుధవారము హెచ్ఎం రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్యార్థులకు తెలంగాణ భాషకు సంబంధించి కవుల యొక్క రచనలు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఈవీఎం గోదాంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి..

సీసీ కెమెరాలు, అగ్నిమాపక వ్యవస్థ పరిశీలన

మన కర్తవ్యం న్యూస్,నిర్మల్ బ్యూరో

కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలోని వివిధ రిజిస్టర్లను తనిఖీ చేసి, ఈవీఎంల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం సీసీ కెమెరాల పనితీరును పరిశీలించడంతో పాటు అగ్నిమాపక వ్యవస్థ సక్రమంగా పనిచేస్తున్న తీరును తనిఖీ చేశారు.ఈవీఎం గోదాం వద్ద భద్రతకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తూ మెరుగైన భద్రతను కొనసాగించాలని సూచించారు. అలాగే అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ముజాహిద్ అలీ, సయ్యద్ మజ్‌హర్, గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, శ్రావణ్, అజ్‌హర్‌తో పాటు అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్‌ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క, బీఆర్‌ఎస్ నేతల దాడిలో గాయపడిన మహిళా పోలీసు సిబ్బందిని పరామర్శించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను తమ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని ఆమె స్పష్టం చేశారు. కాగా, మంత్రి సీతక్క విడుదల చేసిన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినవని, అవి ఏఐ-జనరేటెడ్ అని బీఆర్‌ఎస్ నేతలు కొట్టిపారేశారు.

స్టైఫండ్ డబుల్.. ఆయుష్‌విద్యార్థులకు సర్కార్ గుడ్‌న్యూస్

మొదటిపేజీ తరువాయి

యువతే దేశ భవిష్యత్తు.. విద్యార్థులే భావి పౌరులు అని మంత్రి అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలో గుణాత్మక మార్పుకు విద్య పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్ధిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. "మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది" అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

సన్న రకం వరి పంట ఆన్‌లైన్ నమోదు నేడే చివరి తేదీ

మన కర్తవ్యం న్యూస్ ముస్తాబాద్/ సిరిసిల్ల

ప్రభుత్వం ప్రకటించిన సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ పొందేందుకు రైతులు తమ పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల వ్యవసాయ అధికారి కె.అనూష తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన క్రింది 7 సన్న రకం వరి వంగడాలకు ఈ నమోదు ప్రక్రియ వర్తిస్తుంది. ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, బిపిటి 5204, డబ్ల్యూ జి ఎల్ 44, హెచ్ఎంటి సోనా. ఈ వంగడాలలో వరి సాగు చేసిన రైతులు రేపు అనగా 10-09-2026 చివరి తేదీ కావున ఎలాంటి ఆలస్యం చేయకుండా తమ పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. విత్తన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు: సంబంధిత విత్తన డీలర్ ద్వారా ఆన్‌లైన్‌లో పంట వివరాలను నమోదు చేయించుకోవాలి. విశ్వవిద్యాలయాలు లేదా పరిశోధనా కేంద్రాల నుండి విత్తనాలు పొందిన రైతులు, అలాగే సొంత విత్తనాలను ఉపయోగించిన రైతులు, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి, తమ పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి.లిడిజిటల్ క్రాప్ సర్వేకు రైతులు సహకరించాలిలిప్రస్తుతం గ్రామాల్లో డిసిఎస్ వాలంటీర్ల ద్వారా డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహణకు సహకరించాలని అధికారులు కోరారు. డిజిటల్ క్రాప్ బుకింగ్‌లో సన్న రకం వరి వివరాలు సరిగ్గా నమోదు అయ్యేలా సహకరించాలి.

ఉపాధ్యాయుల ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

మన కర్తవ్యం న్యూస్ ప్రతినిధి, అమరచింత, వనపర్తి జిల్లా.

పీఆర్టీయూ-టీఎస్ అమరచింత మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న టీజీఈ జేఏసీ ధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అమరచింత మండల అభివృద్ధి అధికారి పి. శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సద్దాల శ్రీనివాసులు, మండల అధ్యక్షులు ఎం. రాజు, యూటీఎఫ్ నాయకులు రాములు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం.డి. గౌస్‌తో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.హైదరాబాద్‌లో జరగనున్న టీజీఈ జేఏసీ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు.

గార్ల ,సెప్టెంబర్ 9 (మన కర్తవ్యం)

గార్ల మండల పరిదిలోని సీతంపేట గ్రామంలో గార్ల బయ్యారం సిఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం గుడుంబా స్థావరాలపై దాడులు సిర్వహించి 20లీటర్ల గుడుంబాను స్వాదీన పర్చుకొని 300లీటర్ల బెల్లం పానకాన్ని, ధ్వంసం చేశారు. సరైన పత్రాలు నెంబర్ ప్లేట్ లేని 34 వెహికల్స్ ని సీజ్ చేసి సైబర్ క్రైమ్స్ గంజాయి నిర్మూలన సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు అనంతరం ఈ సందర్భంగా బయ్యారం సిఐ రవీందర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు గుడుంబా తయారీ విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి దాడులు చేయడం జరిగిందని అక్రమ గుడుంబా తయారీ, విక్రయలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గార్ల ఎస్సై సాయికుమార్ బయ్యారం ఎస్సై ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనరద్దు చేయం

ప్రపంచస్థాయి ప్రమాణాలు, విస్తారమైన ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతతో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించగలవని ఆయన పేర్కొన్నారు. "తెలంగాణ రైతు పండించిన ధాన్యానికి అంతర్జాతీయ మార్కెట్ ద్వారాలు తెరవడమే మా ప్రభుత్వ లక్ష్యం. బియ్యం ఎగుమతులు విస్తరించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతోపాటు రైస్‌మిల్లర్లు, విత్తన కంపెనీలు, మాంస ఉత్పత్తిదారులు, ఆహారశుద్ధి పరిశ్రమలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగా కాకుండా ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన లాభసాటి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలకు అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం, ఆహారశుద్ధి, విత్తనోత్పత్తి, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రంగాల్లో తెలంగాణ--ఫిలిప్పీన్స్ మధ్య నూతన భాగస్వామ్యానికి ఈ సమ్మిట్ బలమైన పునాది వేస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

శాసనసభ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి

హైదారాబాద్, సెప్టెంబర్ 09(మన కర్తవ్యం):

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్?ఎస్? సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్? అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్‌ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్?ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిన పొలాస సహస్ర లింగాల క్షేత్రం...

వేయి లింగాలకు అన్నాభిషేక మహోత్సవం...శివనామస్మరణతో పులకించిన భక్తజనం...

జగిత్యాల రూరల్ సెప్టెంబర్ 09:(మన కర్తవ్యం).

పరమశివుని కరుణాకటాక్షాలకు నిలయమైన పొలాస సహస్ర లింగాల దేవాలయం బుధవారం శివమయమైంది.వేలాది మంది భక్తుల కొలహలం తో జాతర వాతావరణం నెలకొన్నది శ్రావణ మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అన్నపూజ మహోత్సవం భక్తి పారవశ్యంతో, వేదమంత్ర ఘోషతో అలరారింది.ఆలయ వ్యవస్థాపక చైర్మన్ నలమాస గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దివ్య కార్యక్రమంలో వేయి శివలింగాలు అన్నాభిషేకంతో దేదీప్యమానంగా వెలిగిపోయాయి. భక్తులు తమ స్వహస్తాలతో శివయ్యకు అన్నాన్ని సమర్పించి, ఆత్మానందం పొందారు. "హర హర మహాదేవ శంభో శంకర" అనే నినాదాలతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది.జగిత్యాల జిల్లా నలుమూలల నుండే కాకుండా కరీంనగర్, నిర్మల్, మంచిర్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రాగ హైదరాబాద్ నుండి సైతం భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. వేయి లింగాలకు అన్న పూజ మహోత్సవాన్ని తిలకించిన భక్తుల ఆనందానికి అవధులు లేవని భక్తులు తెలిపారు. ఈ పుణ్య కార్యక్రమం చూడడం పూర్వ జన్మ సుకృతమని మహిళా భక్తులు చెట్ల జానకి టీం సభ్యులు, తదితరులు పేర్కొన్నారు.భజన బృందాల సంకీర్తనలు, మంగళహారతి గీతాలతో క్షేత్రమంతా జాతర శోభను సంతరించుకుంది.అనంతరం వేద పండితులు భక్తులకు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపి, హారతి, ఆశీర్వచనం అందించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ జరిగింది.సుమారు 300 కిలోల బియ్యంతో తయారుచేసిన పవిత్ర అన్నాన్ని పూజానంతరం రాయపట్నం వద్ద పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేయడం విశేషం. శివునికి అన్నం సమర్పించడం వల్ల అన్నదోషాలు తొలగి, ఐశ్వర్యం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఈ మహోత్సవంలో జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం దంపతులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్ దంపతులు, పురానిపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ కొత్త ప్రతాప్,జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి-మంజుల దంపతులు,ఆలయ ట్రస్టీ సభ్యులు శేఖర్ దంపతులు,జగిత్యాల మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ఆడువాల జ్యోతిలక్ష్మణ్ , ఎడమల పద్మారెడ్డి, చెట్ల జానకి బృందం, బొందుకూరి శ్రీనివాస చారి,తదితర ప్రముఖులు, ట్రస్టీ సభ్యులు, మహిళా సేవకురాళ్లు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

యూరియా యాప్‌ను మండలాల వారీగా నిర్వహించాలి

కరెంట్ కోతలు లేకుండా చూడాలి.. పాత పద్ధతిలో సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రైతు రక్షణ సమితి.

నర్సాపూర్/కౌడిపల్లి. తెలంగాణ మంజీరా న్యూస్

తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు అక్కమొల్ల మైసయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అక్కమొల్ల మైసయ్య యాదవ్ మాట్లాడుతూ.. రైతులకు యూరియా సకాలంలో అందేలా యూరియా యాప్‌ను మండలాల వారీగా నిర్వహించాలని కోరారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక సమయాలను కేటాయించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం వర్షాలు సక్రమంగా లేకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలను కాపాడుకోవడానికి విద్యుత్‌పై ఆధారపడుతున్నారని తెలిపారు. పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా అందించాలని కలెక్టర్‌ను కోరారు.పాత పద్ధతిలో రైతు బీమా అమలు చేయాలి రైతు బీమా పథకం గడువు ఆగస్టు 13తో ముగిసిన నేపథ్యంలో గతంలో అమలు చేసిన విధానంలోనే రైతు బీమా పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన రైతులందరికీ బీమా పథకం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే గతంలో సన్న వడ్లలో 33 రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించారని గుర్తుచేశారు. ప్రస్తుతం కేవలం ఏడు రకాలకే రూ.500 బోనస్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం వల్ల అనేక మంది రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గతంలో మాదిరిగానే సన్న వడ్లకు సంబంధించిన 33 రకాల ధాన్యానికి రూ.500 బోనస్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతులుఎదుర్కొంటున్న యూరియా, విద్యుత్, రైతు బీమా, సన్న వడ్ల బోనస్ తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. యూరియా పంపిణీని మండలాల వారీగా నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తామని, విద్యుత్ కొరత లేకుండా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రైతు బీమా, సన్న వడ్ల బోనస్ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపినట్లు మైసయ్య యాదవ్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంతం గారి వెంకటేశం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పరశురాం యాదవ్, జిల్లా సభ్యులు పెద్దకోళ్ల మల్లేష్తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్ ఎస్ నాయకుల వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్ తెలంగాణ మంజీరా న్యూస్.

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ గారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న యువజన కాంగ్రెస్ నాయకులు పట్టణ కాంగ్రెస్ కార్యకర్తలు ఈరోజు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర శాసనసభ స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈరోజు ఇద్దరూ ఎమ్మెల్సీ ల దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండలం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రిజ్వాన్. నర్సాపూర్ పట్టణం మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ నర్సాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అజ్మత్ అలీ నర్సాపూర్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్ అహ్మద్, సాగర్, మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు ఇతర గ్రామంలో సర్పంచ్లు పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తూప్రాన్ మండలంలోని బ్రాహ్మణపల్లి అక్కన్నపేట రైల్వే స్టేషన్ వద్ద అజంతా ఎక్స్ ప్రెస్ ఆపాలి

సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ వాస్తవ గారికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు విజ్ఞప్తి

నర్సాపూర్ సెప్టెంబర్ 09 తెలంగాణ మంజీరా న్యూస్

మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్, వాస్తవ ని ఈరోజు కలిసి నర్సాపూర్ నుండి తూప్రాన్ వెళ్ళే రైల్వే మార్గం బ్రాహ్మణపల్లి గేట్ వద్ద ఫ్లైఓవర్ గురించి మరియు అక్కన్నపేట రైల్వే స్టేషన్ లో అజంతా ఎక్స్ప్రెస్ ఆపాలని ఎంపీ చెప్పడం జరిగింది. రైల్వే జీఎం, కూడా సానుకూలంగా స్పందించి ఈ వారం 10 రోజులలో డీపీర్, పూర్తి చేసి మంజూరు చేస్తానని చెప్పడం జరిగింది. ఎంపీ రఘునందన్ రావు గారు ఎప్పుడూ ప్రజల కొరకై ఆలోచిస్తూ ఈ పనులను మంజూరు చేయించినందుకు నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల తరఫున తూప్రాన్ ప్రజల తరఫున ఎంపీ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్,బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాప గారి రమేష్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండల్ రావు,జిల్లా కార్యదర్శి బిక్షపతి జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్,మండల అధ్యక్షులు రవి మోర్చా జిల్లా నాయకులు విఠల్ నాయక్,నగేష్ గౌడ్ సర్పంచ్ కుమార్,నర్సాపూర్ అసెంబ్లీ మరియు శివంపేట మండల నాయకులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి సెప్టెంబర్ 09 తెలంగాణ మంజీరా న్యూస్

జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వినాయక చతుర్థి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి బుధవారం జిల్లా కలెక్టర్ , ఎస్పీ తో కలిసి కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,గణేష్ ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. మండపాల వివరాలను నిర్వాహకులు సంబంధిత అధికారులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలను నివారించేందుకు నాణ్యమైన విద్యుత్ వైరింగ్, తగిన భద్రతా పరికరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు క్రేన్లు, తగిన లైటింగ్, బారికేడింగ్, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు.నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా ప్రజలు, ముఖ్యంగా యువతలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.నిమజ్జన కార్యక్రమంలో పోలీసుల సూచనలు, నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, కాలుష్య నియంత్రణ మండలి, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ, నీటిపారుదల, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సంగారెడ్డి తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలకు బీహార్ గ్రూప్--1 అధికారుల ప్రశంసలు

సంగారెడ్డి సెప్టెంబర్ 09 తెలంగాణ మంజీరా న్యూస్

ఎంసీఆర్ హెచ్ ఆర్ డి, హైదరాబాద్ నుంచి శిక్షణలో భాగంగా వచ్చిన బీహార్ రాష్ట్రానికి చెందిన 120 మంది గ్రూప్--1 అధికారుల బృందం సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్యను సందర్శించింది. ఈ సందర్భంగా అదనపు డి ఆర్ డి ఓ సెర్ప్--ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల గురించి అధికారులకు వివరించారు. అనంతరం మహిళా వ్యాపారవేత్తలతో అధికారుల బృందం ప్రత్యేకంగా ఇంటరాక్షన్ నిర్వహించింది. మహిళా శక్తి పెట్రోల్ బంక్, వాణిజ్య దుకాణ సముదాయం, ఫసల్వాడిలోని కేసర్ సాక్స్ యూనిట్‌ను సందర్శించి, మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించారు.మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి మరియు వ్యాపార అవకాశాలను పెంపొందించడంలో సెర్ప్--మహిళా సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని బీహార్ గ్రూప్--1 అధికారుల బృందం ప్రశంసించింది. మహిళా సాధికారతకు ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కోశాధికారి, మహిళా సంఘాల సభ్యులు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కవి కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం

సామాజిక, రాజకీయ చైతన్యానికి కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయం

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి సెప్టెంబర్ 09 తెలంగాణ మంజీరా న్యూస్

ప్రజా కవి కాళోజీ నారాయణరావు జీవితం, ఆయన సాహిత్య స్ఫూర్తి, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు సమాజం ముందుకు తీసుకువచ్చి ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని నింపారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాన్యుల గొంతుకగా తన సాహిత్యాన్ని మలిచిన కాళోజీ ప్రజా కవిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలు, సామాజిక పరిస్థితులపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. కాళోజీ ఆలోచనా విధానం, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత కాళోజీ జీవితం, సాహిత్యం, ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు.అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు కేవలం కవిగా మాత్రమే కాకుండా సామాజిక చైతన్యవేత్తగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని అన్నారు. ఆయన సాహిత్యం నేటికీ ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తోందని, కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, డీపీఆర్వో విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 3వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

సంగారెడ్డి సెప్టెంబర్ 09 తెలంగాణ మంజీరా న్యూస్

సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్‌అదాలత్‌ను 12-09-2026న సంగారెడ్డి జిల్లా కోర్టుతో పాటు జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ మరియు జిన్నారం కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించనున్నట్లు సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఌ సెషన్స్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జి. భవానీ చంద్ర తెలిపారు.జాతీయ లోక్‌అదాలత్ ద్వారా వివిధ రకాల సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకింగ్ మరియు ఇతర రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన న్యాయమూర్తి పేర్కొన్నారు. 12 సెప్టెంబర్ 2026న నిర్వహించనున్న 3వ జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక సంఖ్యలో కేసులను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులను కోరారు. పెండింగ్ కేసులతో పాటు ప్రీ-లిటిగేషన్ దశలో ఉన్న వివాదాలను కూడా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలు తమ కేసుల పరిష్కారం కోసం సంబంధిత కోర్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ/తాలూకా న్యాయ సేవా కమిటీను సంప్రదించి లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని, జి. భవానీ చంద్ర పిలుపునిచ్చారు."రాజీ మార్గమే ఉత్తమ మార్గం లోక్‌అదాలత్ ద్వారా త్వరితగతిన న్యాయం" అనే లక్ష్యంతో 3వ జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడానికి అన్ని వర్గాలు సహకరించాలని ఆమె కోరారు.

కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభం

సంగారెడ్డి సెప్టెంబర్ 09 తెలంగాణ మంజీరా న్యూస్

కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్)లో మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించేందుకు చేపట్టిన బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఈరోజు అదరపు జిల్లా కలెక్టర్, పాండు ప్రారంభించారు. ఏ ఐ జి హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. కె. లలితాదేవి , పి ఐ నసీడీ డీటీమ్ దీప్తి, అడిషనల్ డి ఆర్ డి ఏ, డా. బాలరాజ్, కంది ఎంపీడీఓ,శ్రీనివాస్ సర్పంచ్ సాయి శ్రీరామ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బ్రెస్ట్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని తెలిపారు. మహిళలు ఎటువంటి అనుమానాస్పద లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, అందుబాటులో ఉన్న స్క్రీనింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు, ముందస్తు గుర్తింపు--ముందస్తు చికిత్స లక్ష్యంగా ఇలాంటి స్క్రీనింగ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలో పదవులు రాని వారు నిరాశ చెందొద్దు

పదవులు వచ్చినా రాకున్నా నేను అందరినీ గుర్తిస్తా

త్వరలోనే మండలాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి కార్యకర్తతో వన్ టు వన్ మాట్లాడతా

సంగారెడ్డి నియోజకవర్గంలోని 4 మండలాలు, 2 మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశంలో జగ్గారెడ్డి

సంగారెడ్డి సెప్టెంబర్ 09 తెలంగాణ మంజీరా న్యూస్

సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం బుధవారం సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ప్రకటించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్‌తో పాటు ఇతర ఫ్రంటల్ ఆర్గనైజేషన్ల కమిటీలను సైతం ప్రకటించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీకి పదవులు వచ్చిన వారు, రాని వారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో పదవులు రాని వారు ఎలాంటి నిరాశకు గురికావద్దని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్తను తాను గుర్తిస్తానని జగ్గారెడ్డి అన్నారు. అందరూ కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారులతో సమీక్ష సమావేశాలు సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై త్వరలో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. నాలుగు మండలాలకు చెందిన గెలిచిన, ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో అధికారుల సమక్షంలో ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అదేవిధంగా రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, అధికారులతోనూ ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుసగా సమావేశాలు నిర్వహించి, ప్రతి ఒక్కరితో వన్‌టువన్‌గా మాట్లాడతానని చెప్పారు. ఈ సమావేశాలకు పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను కూడా పిలిచి ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని జగ్గారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

తెలంగాణ మంజీర న్యూస్..

అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేత. సంగారెడ్డి లోకల్ టైమ్స్ న్యూస్ ప్రతినిధి: సంగారెడ్డి మహిళా పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆసుపత్రికి చేరుకొని హరిప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. పోలీసు శాఖ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్ 1993లో ఉమ్మడి మెదక్ జిల్లాలో సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా నియమితులై, అప్పటి నుంచి పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందించారు. గత 4 నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న హరిప్రసాద్, ఈ రోజు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వెంట డీఎస్పీ సత్యయ్య గౌడ్, మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ కుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు జనార్ధన్, రమేష్ తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌ను గద్దె దించాలి

విద్యార్థులు, నిరుద్యోగులు పోరాటం కొనసాగించాలిమాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

నాగర్ కర్నూల్ తెలంగాణ మంజీరా

విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. అప్పటివరకు విరామం లేకుండా పోరాటం కొనసాగించాలని కోరారు.

బుధవారం కాంగ్రెస్ పాలనపై నిరసనగా 'నిరుద్యోగ విద్యార్థి గర్జన' పేరుతో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత మార్కెట్ యార్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, నిరుద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేదని, హామీ ఇచ్చిన స్కూటీలను అందించ లేదని ఆరోపించారు. విద్యార్థులకు ఇస్తామని ప్రకటించిన విద్యానిధి, నిరుద్యోగ భృతి అమలు కాలేదని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం కమిషన్లు దండుకుంటోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నిధులు విడుదల చేయడం లేదని ఆయన ఆరోపించారు. అసెంబ్లీలో టీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసి వారి గొంతు నొక్కుతు న్నారని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు తమ తల్లిదండ్రులకు వాస్తవ పరిస్థితులను వివరించి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయకుండా టీఆర్ఎస్‌ను గెలిపించాలని, కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులపై మర్రి జనార్ధన్‌రెడ్డి ఆగ్రహంవిద్యార్థులు ధర్నాకు రాకుండా కళాశాలల యాజమాన్యాలకు పోలీసులు ఫోన్ చేసి విద్యార్థులను పంపించవద్దని చెప్పడం ఏమిటని మర్రి జనార్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ వ్యవహారశైలిపై ఆయన తీవ్రంగా స్పందించారు. పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు

యూరియా ఇవ్వాలని కోరినందుకు తనపై కేసులు పెట్టారని, ఎన్ని కేసులు పెట్టినా తాను భయపడబోనని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, అప్పటి వరకు జరిగిన వ్యవహారాలపై చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ సంఖ్యలోనే ఉద్యోగాలు ఇచ్చి, గతంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను కూడా తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. విద్యార్థులకు హామీ ఇచ్చిన రూ.5 లక్షల విద్యానిధి ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు.

బీసీలకు ఉచితంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాల భర్తీ జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ, ధర్నాలో టీఆర్ఎస్వీ విభాగం రాష్ట్ర నాయకులు విష్ణుసాగర్‌తో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రాహ్మణ పల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి మంజూరు

ప్రక్రియ ప్రారంభం-మెదక్ ఎంపీ రఘునందన్ రావు వెల్లడి

హర్షం వ్యక్తం చేసిన తూప్రాన్ నర్సాపూర్ భాజపా నేతలు

తూప్రాన్, సెప్టెంబర్ 9 తెలంగాణ మంజీరా ప్రతినిది:

ఉమ్మడి మెదక్ జిల్లా తూప్రాన్--నర్సాపూర్ రోడ్డు మార్గంలో బ్రాహ్మనపల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం అలాగే అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్‌కు ఆల్టింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరంపై చర్చించేందుకు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘు నందన్ రావు బుధవారం నాడు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ను మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సానుకూలంగా స్పందిస్తూ..బ్రాహ్మనపల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికను త్వరగా ఖరారు చేసి, పది రోజులు లోగా మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను నిరంతరం గుర్తించి,వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కు భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాళ్దాస్ మల్లేష్ గౌడ్,తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ మరియు జిల్లా బిజెపి నేతలు ధన్యవాదాలు తెలియజేశారు.

కేసీఆర్‌పై 'మరణ' వ్యాఖ్యలుషాద్‌నగర్ ఎమ్మెల్యే తీరుపై బీఆర్ఎస్ భగ్గు

హాని చేయడానికి ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కసీఆర్ భద్రతను తక్షణమే సమీక్షించాలని కోరిన ఖమ్మం బీఆర్ఎస్ నేతలు

ఖమ్మం బ్యూరో తెలంగాణ మంజీరా సెప్టెంబరు 9

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు అన్నారు. కేసీఆర్ మరణాన్ని కోరేలా, ఆయనకు హాని కలిగించే విధంగా ప్రేరేపించే ధోరణిలో వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. సెప్టెంబర్ 8న ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా, అర్టివి లో ప్రసారం ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, హింసకు దారితీసేలా వ్యాఖ్యలు చేయడం మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం మౌనం వహించకూడదని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఒక ప్రజాప్రతినిధి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు, అనుచరుల మధ్య ఘర్షణలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు జరిపి, భారతీయ న్యాయ సంహితలోని నిబంధనల మేరకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటి, వాటి వల్ల ఎలాంటి పరిణామాలకు అవకాశం ఉందన్న అంశాలపైనా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రోత్సహించినా, సహకరించినా వారి పాత్రను కూడా విచారించాలని అన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కేసీఆర్ భద్రతను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి హాని జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు ఒక పరిమితి ఉండాలని, ఆ పరిమితి దాటితే ప్రభుత్వం చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దండ జ్యోతి రెడ్డి అయ్యప్ప రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, దేవభక్తుని కిషోర్ బాబు, కొనకంచి ప్రసాద్, కోలేటి రాధాకృష్ణ, జాబిశెట్టి శ్రీనివాసరావు, చిలకల వెంకట నరసయ్య, పొదిలి నాగరాజు, యాకూబ్ పాషా, మారగాని సుదర్శన్, వంగవీటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, సెప్టెంబర్ 9 (తెలంగాణ మంజీరా ప్రతినిధి):

చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా, ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ చక్కటి అవకాశమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కోర్టుల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అవగా హనతో త్వరితగతిన పరిష్కరించు కునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని తెలిపారు. అంతేకాకుండా ఇరువర్గాల మధ్య స్నేహపూర్వక వాతా వరణం ఏర్పడుతుందని అన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్, ఆస్తి, కుటుంబ, వైవాహిక వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, సైబర్ సంబంధిత రాజీ పడదగిన కేసులను చట్టపరమైన నిబంధనలకు అను గుణంగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిం చుకునే అవకాశం ఉందని వివ రించారు. వివాదాలను కక్షలుగా మార్చుకుని ఇరువర్గాలు విలువైన సమయం, ధనాన్ని కోల్పోవద్దని ఎస్పీ సూచించారు. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి సంబంధిత పక్షాలకు అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కృషి చేస్తారని ఎస్పీ తెలిపారు. తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

నిర్వాహకుల సన్నాహక సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్

తూప్రాన్, సెప్టెంబర్ 9 (తెలంగాణ మంజీరా ప్రతినిధి):

వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలకు తావులేకుండా నిర్వహించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఉత్సవాల నిర్వాహకులకు సూచించారు. తూప్రాన్ పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్స్‌లో బుధవారం వినాయక ఉత్సవాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి తూప్రాన్ సర్కిల్ పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్, శివంపేట్, వెల్దుర్తి మండ లాలకు చెందిన వినాయక ఉత్సవాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో హాజ రయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాం తంగా జరిగేలా నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. వినాయక మండపాల ఏర్పాటు, నిమజ్జన ఊరేగింపుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిం చాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మండపాలు ఏర్పాటు చేసు కోవడంతో పాటు, ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించు కోవాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో తూప్రాన్ సీఐ వెంకటరాజా గౌడ్, ఎస్ఐ వి. గంగరాజు, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, శివంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి, వెల్దుర్తి ఎస్ఐ కర్నాకర్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ కమిషనర్, ఎంఆర్ఓ, విద్యుత్ శాఖ ఏఈలు, ఇతర శాఖల అధికారులు, వినాయక ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.